క్లుప్తంగా

గీత కార్మికుడికి పరామర్శ



హన్మకొండ: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడిని తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి గోపీగౌడ్, నాయకులు ఆదివారం పరామర్శించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనారాయణపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు వంగ యాదగిరి గౌడ్. వృత్తిలో భాగంగా శనివారం తాడిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని సంఘం నాయకుల పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనగాం వెంకన్నగౌడ్, మార్క రవీందర్‌గౌడ్, చిర్ర వెంకటస్వామిగౌడ్, కటుకూరి నాగరాజుగౌడ్, నాగపురి జగన్ గౌడ్, రాజేంద్రప్రసాద్‌గౌడ్, నాగపురి రాజయ్యగౌడ్, తాళ్లపల్లి రమేష్‌గౌడ్, వంగ పవన్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రోహిత్‌గౌడ్ పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



శాయంపేట : గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు అయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మేరగుర్తి రవి ఆదివారం రాత్రి గుడుంబా విక్రయించేందుకు బాటిళ్లలో తీసుకెళ్తున్నాడు. గమనించిన పోలీసులు అతన్ని తనిఖీ చేయగా 8 లీటర్ల గుడుంబా లభించినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. గుడుంబాను సీజ్ చేసి రవిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. మండలంలో ఎవరైనా గుడుంబా తయారీ చేసినా, విక్రయించినా పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇందుకు అర్హులైన విద్యార్థులు నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు విద్యార్హత పత్రాలతో నేడు(సోమవారం) నేరుగా కళాశాలకు రావాలని సూచించారు.

డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ



రాయపర్తి : మండలకేంద్రంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తూరు గ్రామస్తులకు ఆదివారం ఉచిత డ్రైవింగ్ లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ చేసినట్లు బీఆర్‌ఎస్ గ్రామపార్టీ అధ్యక్షుడు దొమ్మటి సుభాష్, సర్పంచ్ కందికట్ల స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ ప్రధాన కార్యదర్శి తాటికాయల భాస్కర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంబురాలు



నల్లబెల్లి : సీఎం కేసీఆర్ దివ్యాంగులకు రూ.4,116 పెంచిన పింఛన్లు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు మండలంలోని నందిగామ గ్రామంలో ఆదివారం దివ్యాంగులు సంబురాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు అడ్డ రాజు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో దివ్యాంగుల పింఛన్ కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేసిన గొప్పనాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి దివ్యాంగుల కుటుంబాలు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, గండు శ్రీధర్, కందికొండ రాములు, మేడిపల్లి సుధాకర్, బ్రహ్మచారి, వైనాల శ్రీనివాస్, సంగ రాజశేఖర్, అడ్డ సంజీవ, బొమ్మకంటి పోశయ్య, చిట్యాల భిక్షపతి, మురళి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వర్ధన్నపేట : మండల కేంద్రానికి చెందిన డెయిరీ ఏజెంట్ దుబ్బాక మధుసూదన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నాగార్జున డెయిరీ ఎండీ ప్రభాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అరుణ, వార్డు కౌన్సిలర్ పాల్గొన్నారు.

అమిత్‌షా సభకు బీజేపీ శ్రేణులు..



పరకాల : జెండా ఊపుతున్న మాజీ ఎమ్మెల్యే



ఆత్మకూరు : సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు



ఐనవోలు : జెండా ఊపుతున్న కోటేశ్వర్‌రావు

పరకాల: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన బీజేపీ బహిరంగ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి వాహనాలను ముందుకు కదిలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, తెలంగాణ ప్రజలు సైతం రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. మోదీ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, పుట్ట రవీందర్, దుబాసి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఖమ్మం జిల్లాలో ఆదివారం జరిగిన అమిత్‌షా సభకు మండలంలోని బీజేపీ కార్యకర్తలు తరలివెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్‌సెల్ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, కార్యదర్శి బయ్య పైడి, సముద్రాల రవి, వెల్దె సదానందం, ప్రదీప్‌రెడ్డి తదితరులు వెళ్లినవారిలో ఉన్నారు.

ఐనవోలు: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న రైతు గోస – బీజేపీ భరోసా సభకు మండలంలోని బీజేపీ శ్రేణులు ఆదివారం తరలివెళ్లారు. జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 500 మంది బీజేపీ కార్యకర్తలు ఖమ్మం సభకు తరలినట్లు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. సభకు వెళ్లిన వారిలో జిల్లా కోశాధికారి బొల్లపెల్లి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గండు రణధీర్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాక కుమారస్వామి, నాయకులు రవీందర్‌రెడ్డి, కట్ల శ్రీనివాస్, అమరవాది నాగరాజు, గబ్బెట ప్రశాంత్, బీరం యాదవరెడ్డి, అరుణ్, తీగల శేఖర్, భాస్కర్, సతీష్ తదితరులు ఉన్నారు.

ఆదరణ చూసి ఓర్వలేకనే వ్యక్తిగత దూషణలు



సమావేశంలో మాట్లాడుతున్న జయమ్మ

నర్సంపేట రూరల్ : నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొందరు వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని జెడ్పీటీసీ కోమాండ్ల జయగోపాల్‌రెడ్డి, ఎంపీపీ మోతె కళావతి పద్మనాభరెడ్డి ఆరోపించారు. మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల స్థాయి సమావేశం ఆదివారం మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజన్ లేని వాళ్లే.. ఎన్నికలు రాగానే విచక్షణ రహితంగా మాట్లాడుతారని, వారిని ప్రజలు నమ్మరని, రానున్న ఎన్నికల్లో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుంటే ప్రతిపక్షాలకు కనపడడం లేదా అని ప్రశ్నించారు. నర్సంపేట ఎమ్మెల్యేగా ఐదు సంవత్సరాలు దొంతి మాధవరెడ్డి పనిచేసి ప్రజలకు ఒరగబెట్టింది ఏమిలేదన్నారు. మాధన్నపేట చెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేస్తే, పనులు చేయకుండా డబ్బులు వాపస్ చేసిన ఘనుడు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కోడారి రవి, సర్పంచ్ మొలుగూరి చంద్రమౌళి, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా కుమార్



పిండి కుమార్

ఖానాపురం : మండలంలోని రంగాపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా పిండి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూర్తి హరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తానని అన్నారు.

నియామకం

నల్లబెల్లి : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన పురుషోత్తం సురేష్‌ను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఆవుల రానిల్, అడ్డగట్ల కోటి, దుకిరే నవీన్, మండల ప్రధాన కార్యదర్శిగా పొన్నాల కర్ణాకర్, మండల కార్యదర్శులుగా ఎనుగంటి యుగేందర్, పెంతల రాజు, ఆంగోత్ శ్రీను, ప్రచార కార్యదర్శిగా ముస్కు రంజిత్, కార్యవర్గ సభ్యులుగా అంజీరా రాందాస్, కొట్టం రాజ్ కుమార్, ఈర్ల సాయి, మడిపెల్లి భాస్కర్, గడ్డి హరీష్‌లను నియమించినట్లు పేర్కొన్నారు.

గడప గడపకూ ప్రచారం



నెక్కొండ : బీఆర్‌ఎస్ పార్టీ ఇస్తున్న దొంగ హామీలు, ఓటు బ్యాంకు రాజకీయాలను ప్రజలు గమనించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ కోరారు. మండలంలోని అలంకానిపేటలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అధికార దాహంతో రోజురోజుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శివకుమార్, ఈదునూరి సాయి కృష్ణ, రావుల మహిపాల్‌రెడ్డి, సింగం ప్రశాంత్, ఎడ్ల కృష్ణయ్య, సముద్రాల కనకయ్య, ప్రకాశం, శివశంకర్, చాగంటి తిరుమల్, కొమ్ము దయాకర్, ఆకుల ఉప్పలయ్య, బిర్రు కమల్, మర్రి రవి, నీలం రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



చెన్నారావుపేట : మండలంలోని లింగాపురం నుంచి మేగ్యతండా వరకు మంజూరైన సీసీ రోడ్డు, బీటీ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పసునూటి రమేశ్ మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనులకు ఐటీడీఏ నుంచి రూ. కోటి 30 లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



కుట్టు మిషన్లను పరిశీలిస్తున్న చీఫ్ విప్

న్యూశాయంపేట: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో హనుమకొండ లష్కర్ బజార్‌లోని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న స్కిల్ డెవలప్‌మెంట్, గార్మెంట్, ప్రొడక్షన్ సెంటర్‌ను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వివరించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో శిక్షణ కార్యక్రమాలపై సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని చీఫ్ విప్‌ను ప్రతినిధులు కోరారు. సొసైటీ కార్యదర్శి సిరాజ్ అహ్మద్, సభ్యులు, అక్బర్‌జియా, సలీం పాల్గొన్నారు.

ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతా..



నిత్యావసర కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: భగత్‌సింగ్‌నగర్ కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. నగరంలోని రెండవ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ కాలనీలో వరద బాధితులకు బాల వికాస, అమెజాన్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో నిత్యావసర కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ వరద ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. వరద ముంపునకు గురికాకుండా ఉండేందుకు శాశ్వత పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కాలనీలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పించడానికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు మేర్గు రాజేష్‌గౌడ్, జక్కు రమేష్, వనంరెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జంగా కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గనిపాక విజయ్‌కుమార్, నాయకులు చింతం శ్రీనివాస్, మంద భాస్కర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గోపి

హసన్‌పర్తి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ గోపి అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి మొబైల్ ఫోన్‌కు వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని అన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలబాలికలను పనిలో పెట్టుకోవద్దని, బడీడు పిల్లలకు బడిలో చేర్పించాలని సూచించారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అమితారెడ్డి, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జీవన్‌రెడ్డి, ఉపసర్పంచ్ సాయిలు, ఎస్సై అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న దీప

హన్మకొండ: మతోన్మాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యురాలు ఎల్.దీప సూచించారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది మతాలు, కులాల పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను చీల్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి కుల, మత రాజకీయాలు ప్రమాదకరమని హెచ్చరించారు. మత ఉన్మాదులను దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వాంకుడోతు వీరన్న, నాయకులు కుక్కముడి రవీందర్, వల్లెపు లింగమూర్తి, వల్లెపు రాజు, కూస రాజేష్, రజిత, అర్షియ, రమాదేవి, స్వప్న, సంపూర్ణ, మురళి, వినయ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్ల పంపిణీ

వరంగల్ క్రైం: ట్రాఫిక్ పోలీసులకు యాక్టు ఫైబర్ నెట్ యజమాన్యం హెల్మెట్లను అందజేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు తెలిపారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుజాత, వరంగల్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, యాక్టు ఫైబర్ నెట్ ప్రతినిధులు ఎన్.సందీప్, ఎండీ.జాకీర్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో ఉమ్మడి ఒలింపిక్ అసోసియేషన్, తెలంగాణ జూడో అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు దుపాకి సంతోష్ తండ్రి భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఆదివారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అజీజ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాశ్ యాదవ్, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గాసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, భిక్షపతి చిత్రపటం వద్ద నివాళులర్పించి బాధితులను పరామర్శించారు. జూడో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సీహెచ్ మహేందర్, చంద్రమోహన్ గౌడ్, హ్యాండ్‌బాల్ కోచ్ విష్ణువర్ధన్ పలువురు ఉన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కమలాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక లక్ష్మీగణపతి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమ్మేళనంలో 33 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, అప్పటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. పదోతరగతిలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉల్లాసంగా గడిపారు. తామందరిని ఒక్కచోటకు చేర్చిన నిర్వాహకులకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుమ్మరి రాజేందర్, ఆస్కార్ శంకర్, మొగిలిచెర్ల శ్రీనివాస్, తోటం తిరుపతి, పాక అశోక్, అంకతి రాజేశ్వర్‌రావు, పుల్ల సంపత్, వీరప్రకాష్, సాంబశివరావు, రమేష్, సుధాకర్, దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అప్పటి గురువులు పాల్గొన్నారు.

ముగిసిన పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎల్కతుర్తి: మండలంలోని వల్బాపూర్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న పోచమ్మతల్లి పునఃప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు నిత్యమండప దేవతా పూజ, యంత్ర విగ్రహారాధన, మాసంతర వంచక రహిత సుముహూర్తం యంత్ర ప్రతిష్ఠ విగ్రహాలను పూర్ణకుంభంతో నృత్యగీత వాయిద్యాలతో పాటు వీరశైవ అర్చక పురోహిత బృదం దండకాల సేవతో ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, దృష్టికుంబబలి, అష్టదిగ్బంధన, నేత్రోన్మీలనము, భూతవలి, జయాదిహోమం, పూర్ణాహుతి, స్థాపిత దేవతల అభిషేకం, శోడశోపచర పూజలు, మంగళహారతి, యంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ, మంటప, దేవతల ఉద్వాసన, వీరమహేశ్వర ఆశీర్వచనాలు, రుత్విక్ సన్మాన సంతర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామ మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ బోనాలు ఎత్తి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దంపతులు అంబాల మమతప్రతాప్, అంబాల సుదర్శన్, అశోక్, తిరుపతి, అంబాల నవీన్, గ్రామ పురోహితుడు సదానిరంజన్ సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు





క్షతగాత్రులు ఇందిరమ్మ, భిక్షపతి

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కటాక్షపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ మండలం ఆరెపల్లెకు చెందిన బట్టిమేకల భిక్షపతి దంపతులు ఆదివారం బైక్‌పై ఆరెపల్లె నుంచి ములుగు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టి పక్కనే రోడ్డు పనులు చేస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన ఇందిరమ్మ అనే కూలీని ఢీ కొట్టింది. దీంతో భిక్షపతి దంపతులతో పాటు ఇందిరమ్మకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. హైవే పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరించడం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



దరఖాస్తు ఫారం అందజేస్తున్న కౌన్సిలర్

పరకాల: పట్టణంలోని 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ కోరారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలోని పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 అక్టోబర్ 1 వ వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలని కోరారు. సెప్టెంబర్ 2, 3 వ తేదీల్లో స్పెషల్‌డ్రైవ్ ఉంటుందని, దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సృజన, బీఎల్‌ఓలు కవిత, జయప్రద పాల్గొన్నారు.

ప్లీనరీకి తరలిన మున్నూరుకాపులు



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

పరకాల: రాష్ట్రంలో మున్నూరుకాపు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ జలవిహార్‌లో ఆదివారం నిర్వహించతలపెట్టిన ప్లీనరీకి మండలంలోని ఆ సంఘం నాయకులు తరలివెళ్లారు. ప్లీనరీ అనతరం మున్నూరుకాపు పరకాల నియోజకవర్గ కన్వీనర్‌గా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొజ్జం రమేష్ నియామకం కాగా కో కన్వీనర్‌గా మాధారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి నియామకయ్యారు. ఈ సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో పాటు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొండా దేవయ్య, పటేల్ అపెక్స్ కమిటీ కన్వీనర్ సర్దార్ పుటంపురుషోత్తంలు అభినందించారు. దామెర, ఆత్మకూరు, సంగెం మండలాల అధ్యక్షుడు కోసనం సత్యనారయణ పటేల్, గంగి శ్రీనివాస్‌పటేల్, తోట బాబురావు పటేల్, ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు



ట్రాన్స్‌ఫార్మర్ తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

శాయంపేట : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ సమీపంలో రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు ఆదివారం తొలగించారు. మండల కేంద్రం నుంచి ఆత్మకూరు వరకు రోడ్డు నిర్మాణ పనులకు జరుగుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్ అడ్డుగా ఉంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు మార్చేందుకు ఇటీవల విద్యుత్‌శాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో మైలారంకు వెళ్లే రోడ్డుకిరువైపుల ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు.